### డీల్ కుదిరినా.. కుదరకున్నా..

## రఫాపై దాడి

**ఇజ్రాయెల్ ప్రధాని స్పష్టీకరణ**

టెల్ అవీవ్, ఏప్రిల్ 30: దక్షిణ గాజాలోని రఫా నగరంపై తాము దాడి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. యుద్ధంలో విజయం సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదరినా, కుదరకపోయినా.. హమాస్‌లను అంతం చేయడానికి ఇజ్రాయెల్ దళాలు రఫాలోకి ప్రవేశిస్తాయని తెలిపారు.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా, ఏప్రిల్ 30: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. 'క్షమించండి నాన్న.. ఈ ఏడాది కూడా నా వల్ల కాదు' అని సూసైడ్ నోట్ పెట్టి 20 ఏండ్ల నీట్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన భరత్ కుమార్ రాజ్‌పుట్ నీట్ ప్రవేశ పరీక్షకు గతంలో రెండు సార్లు హాజరై మే 5న జరిగే టెస్ట్‌కు మూడోసారి సిద్ధమవుతున్నాడు. మంగళవారం తాను ఉంటున్న పీజీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం సుమిత్ పంచల్ (20) అనే మరో విద్యార్థి కూడా తన హాస్టల్ రూమ్‌లో ఉరేసుకుని ఉసురు తీసుకున్నాడు. గతేడాది 26 మంది ఇలా ప్రవేశ పరీక్షల ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది జనవరి నుంచి 9 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు.

## పత్రికా స్వేచ్ఛపై కేంద్రం అణచివేత

**కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు 'ఎడిటర్స్ గిల్డ్' లేఖ**

న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛ విషయంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుసరిస్తున్న అణచివేత ధోరణులు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా చోటుచేసుకున్న ఉదంతాలను పేర్కొంటూ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు లేఖ రాసింది. హిందీ యూట్యూబ్ న్యూస్ చానల్ 'బోల్తా హిందుస్తాన్'ను నిలిపివేయటంపై గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. కనీసం వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వలేదని పేర్కొన్నది.

# కొవిషీల్డ్‌పై భయం వద్దు

- **టీకా వల్ల సమస్యలు ఉంటే తొలి డోసుకే బయటపడ్తాయి**
- **మూడేండ్ల తర్వాత ముప్పు సంభవించే అవకాశమే లేదు**
- **ప్రముఖ గుండెవ్యాధుల వైద్యుడు ఎంఎస్ఎస్ ముఖర్జీ**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కొవిషీల్డ్ వ్యాక్సిన్ దుష్ప్రభావాలపై తయారీ సంస్థ ఆస్ట్రాజెనికా చేసిన ప్రకటన వ్యాక్సిన్ తీసుకున్న వారిని భయాందోళనలకు గురి చేస్తున్నది. తమ వ్యాక్సిన్ తీసుకున్న కొంతమందిలో దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) వస్తున్న మాట నిజమేనంటూ ఆస్ట్రాజెనికా కంపెనీ న్యాయస్థానం ముందు అంగీకరించింది. స్వయంగా కంపెనీనే న్యాయస్థానం ముందు తమ కంపెనీలో తయారైన టీకాతో దుష్ప్రభావాలు ఉన్నాయని, ఇది తీసుకున్న కొందరిలో రక్తం గడ్డ కట్టడం, ప్లేట్‌లెట్లు తగ్గడం వంటి సమస్యలను గుర్తించినట్టు చెప్పింది. దీంతో ఇప్పుడు కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఆందోళన మొదలైంది. అయితే, కొవిషీల్డ్ గురించి ఇప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గుండెవ్యాధుల వైద్యుడు ఎంఎస్ఎస్ ముఖర్జీ చెప్తున్నారు. కరోనా సమయంలో ఆయన వైద్య సలహాలు, జాగ్రత్తలు చెప్తూ ఎందరికో సాయపడ్డ సంగతి తెలిసిందే. కొవిషీల్డ్ వ్యాక్సిన్‌పై ఆయన మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. వ్యాక్సిన్ తీసుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉంటే చాలని ఆయన చెప్తున్నారు. అయితే, వ్యాక్సిన్‌పై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే తాను ప్రయత్నిస్తున్నానని, కొవిషీల్డ్ వ్యాక్సిన్‌పై న్యాయస్థానాలు చెప్పే తీర్పు, వాటి పరిశీలనే అంతిమమని డాక్టర్ ముఖర్జీ పేర్కొన్నారు.



**ప్రశ్న:** ఆస్ట్రాజెనికా టీకా తీసుకుంటే రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉన్నదా?

**జవాబు:** టీకా తీసుకుంటే రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉంటుంది. ఇదేమీ కొత్తగా వచ్చిందో, కొత్తగా చెప్తున్నదేమీ కాదు. దీని గురించి ఇంటర్నెట్‌లో కావాల్సినంత సమాచారం ఉన్నది. ఇలా వచ్చే సమస్యకు, రోగానికి ఒక పేరు కూడా ఉన్నది. దీన్ని 'వ్యాక్సిన్ ఇండ్యూస్డ్ త్రోంబోటిక్ త్రోంబోసైటోపేనియా' అని అంటారు. ఇదేమీ రహస్యం కాదు.

**ప్రశ్న:** కొవిషీల్డ్‌తో రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉందన్న విషయాన్ని ఆస్ట్రాజెనికా దాచిపెట్టిందా?

**జవాబు:** ఇది సరికాదు. ఆస్ట్రాజెనికా తమ వ్యాక్సిన్ గురించి క్షుణ్ణంగా వ్యాక్సిన్‌తో పాటే ఇచ్చే వివరణ కాగితంలో పొందుపరిచింది. దాన్ని చదివితే రక్తం గడ్డ కట్టడం గురించి ఉంటుంది. 2021 ఫిలిప్పిన్స్ ఎఫ్‌డీఏ రూపొందించిన వ్యాక్సిన్ మార్గదర్శకాలను వివరిస్తూ ఇచ్చిన వివరణ కాగితంలో ఇది ఉన్నది.

**ప్రశ్న:** కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్నవారందరికీ ఇలా రక్తం గడ్డ కడుతుందా?

**జవాబు:** వ్యాక్సిన్ తీసుకున్న అందరికీ సమస్యలు వస్తాయన్నది అపోహ మాత్రమే.



ప్రముఖ వైద్యుడు ఎంఎస్ఎస్ ముఖర్జీ

ప్రతీ పది లక్షల మందిలో ముగ్గురి నుంచి 15 మందికి ఇలాంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నది. అంటే మన దేశంలో వంద కోట్ల మంది వ్యాక్సిన్ తీసుకుంటే అతి తక్కువ మందికే వచ్చే ప్రమాదం ఉంటుంది.

**ప్రశ్న:** వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఎంతకాలానికి సమస్య రావొచ్చు ?

**జవాబు:** వ్యాక్సిన్ మొదటి డోస్ తీసుకున్న తర్వాత నాలుగు నుంచి 30 రోజుల్లో ఎప్పుడైనా శరీరంలో సమస్యను గుర్తించవచ్చు. రెండో డోసు తీసుకున్న తర్వాత సమస్యలు పెద్దగా రాకపోవచ్చు. చాలా అరుదుగా మాత్రమే రెండో డోసు వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత సమస్యలు వస్తాయి. మూడేండ్ల తర్వాత ఎలాంటి సమస్యలు రావు. నిశ్చింతగా ఉండొచ్చు.

**ప్రశ్న:** వ్యాక్సిన్ తీసుకున్న కొందరికి గుండెపోటు వస్తున్నదనే ప్రచారం నిజమేనా?

> **ప్రశ్న:** కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత మనలో రక్తం గడ్డ కట్టిందా లేదా? ఏదైనా సమస్యలు ఉన్నాయా అన్నది ఎలా తెలుసుకోగలం?
>
> **జవాబు:** వ్యాక్సిన్ వల్ల వచ్చే క్లాట్స్‌ను ప్లేట్‌లెట్లను పరిశీలించడం ద్వారా తెలుసుకోవచ్చు. మనిషి రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య ఆధారంగా దీనిపై నిర్ధారణకు రావొచ్చు. వ్యాక్సిన్ తీసుకున్నపుడు ప్లేట్‌లెట్లు తగ్గితే ఆందోళన చెందవచ్చు. ప్లేట్‌లెట్లు తగ్గి రక్తం గడ్డ కడుతుంటే అది వ్యాక్సిన్ వల్ల కలిగిన దుష్ప్రభావంగా గుర్తించవచ్చు.

**జవాబు:** వ్యాక్సిన్ వల్ల గుండెపోటు రావడం చాలా అరుదు. మెదడులో రక్తం గడ్డ కట్టే సమస్యలే వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది కూడా వ్యాక్సిన్ తొలి డోస్ తీసుకున్న తర్వాతనే వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రెండో డోసు తర్వాత సమస్య రావడం చాలా అరుదు. అలాంటిది ఏండ్ల తర్వాత రాదు. అందులోనూ గుండెపోటు రాదు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారు వెంటనే మరణించడం అన్నది జరగదు.

**ప్రశ్న:** కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను తీసుకున్న వారికి సైడ్ ఎఫెక్ట్స్ రావొద్దంటే ఏం చేయాలి ?

**జవాబు:** ఆరోగ్యకరమైన జీవన విధానాలను అనుసరించండి. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోండి. వేళకు తినడం, నిద్రపోవడం ముఖ్యం. వ్యాయామం చేయండి. అంతేకాకుండా మనిషికి గుండెపోటు లేదా ఇతర సమస్యలకు ప్రధాన కారణం వ్యాక్సిన్ కాదు.. ధూమపానం.

# కరెంటోళ్లకు కల్పిత ఖాతాల అండ

- **విద్యుత్తుశాఖకు మద్దతుగా పోస్టులు**
- **ఎక్స్‌లో ఊరు, పేరులేని ఖాతాల సృష్టి**
- **ఒక్క ఏప్రిల్‌లోనే 45 అకౌంట్లు ఓపెన్**
- **ఇది టీఎస్ఎస్పీడీసీఎల్ పనేనని వదంతి**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విద్యుత్తుశాఖకు కల్పిత ఖాతాలు, నకిలీ నెటిజన్లు అండగా నిలుస్తున్నారా? ఆ శాఖపై ఈగ వాలకుండా కాపాడుతున్నారా? నిత్యం వచ్చే ఫిర్యాదులకు గట్టి కౌంటర్ ఇస్తున్నారా? కరెంటోళ్ల పనితీరుపై కావాలని ప్రశంసలు కురిపిస్తున్నారా? అంటే నెటిజన్ల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు నిత్యకృత్యమయ్యాయి. పంటలు ఎండిపోతున్నాయి. మెటార్లు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. మంత్రులు, ప్రముఖులు పాల్గొన్న సభల్లో రెండు, మూడు సార్లు కరెంట్ పోతున్నది. కరెంట్ కోతల నుంచి కాపాడండి మొర్రో.. అంటూ ప్రజలు సోషల్ మీడియాలో నిత్యం గగ్గోలు పెడుతుంటే.. మరోవైపు ఈ నకిలీ నెటిజన్లు, కల్పిత ఖాతాదారులు విద్యుత్తుశాఖను వెనుకేసుకొస్తున్నారు. 'ఈ మండుటెండల్లో ఇంట్లో ఏసీ, ఫ్యాన్ వేసుకుని పడుకుంటే గానుగచెట్టు నీడలో నులకమంచం వేసుకుని చల్లగా నిద్రపోతున్న భావన కలుగుతున్నది. ఇంట్లో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా కష్టపడుతున్న టీఎస్ఎస్పీడీసీఎల్ సిబ్బందికి ధన్యవాదాలు' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. రాష్ట్రం నిప్పులకొలిమిని తలపిస్తుంటే.. ఈ నెల 19న ఫేక్ ఐడీ దారు సామాజిక మాధ్య మం ఎక్స్‌లో టీఎస్ఎస్పీడీసీఎల్ సిబ్బందిని ప్రశంసిస్తూ పై పోస్టు పెట్టాడు. రెప్పపాటు కోతల్లేకుండా రాష్ట్రమంతా హాయిగా నిద్రపోతున్నదనే భావన కలిగించేందుకు పోస్టును వదిలారు. కానీ నిజంగా పరిస్థితి అలా ఉన్నదా? ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇది ఫేక్ ప్రచారమని, నకిలీ నెటిజన్ పనే అని చెప్పేందుకు ఇంతకంటే ఉదాహరణ దొరకదు.

**ఏప్రిల్‌లోనే పుట్టిన 45 అకౌంట్లు..**

ఇలాంటివి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 45 నకిలీ ఖాతాలు ఒక్క ఏప్రిల్ నెలలోనే పుట్టాయి. ఊరు.. పేరు ఉండదు. ఆయా ఖాతాలకు ప్రొఫైల్ పిక్చర్లు ఉండవు. అసలు పేర్లుండవు. నిక్‌నేమ్స్‌తో ఉంటాయి. ఎక్స్‌లో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన ఖాతాలను పోలి ఉంటాయి. ఉదాహరణకు నల్లబాలు (NALLABALU) అనే అకౌంట్ ఎక్స్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఖాతా. ఇదే ఖాతాను పోలినట్టు (NALABALU) ఖాతాను సృష్టించారు. దేవుళ్ల ఫొటోలను డీపీలుగా పెట్టి పాపపు పనికి వినియోగించుకుంటున్నారు. ఈ నకిలీ నెటిజన్లు, కల్పిత ఖాతాల వెనుక టీఎస్ఎస్పీడీసీఎల్ హస్తముందన్న వదంతులు ఉన్నాయి. ఇందుకోసం సంస్థ ఓ పీఆర్ ఏజెన్సీని రంగంలోకి దించిందన్న ఆరోపణలున్నాయి. విద్యుత్తు కోతలపై ప్రజల ఆగ్రహం నుంచి తమను తాము రక్షించుకోవడానికి టీఎస్ఎస్పీడీసీఎల్ ఇలా వందల నకిలీ ఖాతాలను సృష్టించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఖాతాలు టీఎస్ఎస్పీడీఎల్ ఎక్స్ ఖాతాను అనుసరిస్తాయి. ప్రతి పోస్టుకు సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని ట్యాగ్‌చేస్తాయి. ఆయన పోస్టులకు క్రమం తప్పకుండా రీపోస్ట్ చేస్తాయి. ప్రత్యుత్తరాలిస్తాయి. పొగడ్తలతో ముంచెత్తుతాయి. ఇది సంస్థ పనే అనేందుకు ఇంతకు మించిన ఆధారం మరొకటి ఉండదని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఈ నకిలీ ఖాతాలు కేవలం పోస్టులు చేయడం వరకే ఆగడం లేదు. విద్యుత్తు కోతలపై గళం వినిపించే నిజమైన ఫిర్యాదుదారులను వేటాడుతాయి. వారి వాదనలు తప్పు అని నిరూపించే ప్రయత్నం చేస్తాయి.

## రైలు దిగుతూ మరణిస్తే పరిహారం చెల్లించాల్సిందే

- **కర్ణాటక హైకోర్టు తీర్పు**

బెంగళూరు: రైలు నుంచి దిగుతూ ప్రమాదవశాత్తు మరణించిన ప్రయాణికులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత రైల్వే శాఖదేనని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పరిహారం నిరాకరిస్తూ రైల్వే అధికారులు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. కదులుతున్న రైలు నుంచి దిగుతున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు మరణించిన కేసులో హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. మృతిచెందిన ఆ ప్రయాణికురాలి కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిందేనని ఆదేశించింది. పిటిషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.4 లక్షలకు 7% వడ్డీతో ఆ మొత్తాన్ని చెల్లించాలని పేర్కొన్నది.

# యూరప్‌కు పాకిన పాలస్తీనా నిరసనలు

- **పారిస్ వర్సిటీలో మిన్నంటిన విద్యార్థుల ఆందోళనలు**
- **అమెరికా వర్సిటీల్లో భవనాలు స్వాధీనం**

న్యూయార్క్, ఏప్రిల్ 30: అమెరికాలో మొదలైన పాలస్తీనా అనుకూల నిరసనలు యూరప్‌కు పాకాయి. తాజాగా పారిస్‌లోని సోబోన్ వర్సిటీ ఆవరణలో వందలాది మంది నిరసనకారులు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలస్తీనా జెండాలు ఎగురవేస్తూ.. యుద్ధ బాధితులకు సానుభూతి




యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో పాలస్తీనా మద్దతుదారుల నిరసన

వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పాలస్తీనా అనుకూల నిరసనలతో అమెరికాలో పలు యూనివర్సిటీల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంటున్నది. మంగళవారం కొలంబియా వర్సిటీలో ఆందోళనకారులు అక్కడి హామిల్టన్ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వర్సిటీ ప్రధాన గేట్లకు అడ్డుగా బారికేడ్లను ఏర్పాటుచేసి, భవనం కిటికీలో నుంచి పాలస్తీనా జెండాను ఎగురవేశారు. వర్సిటీల్లో భవనాల్ని స్వాధీనం చేసుకోవటం, ప్రధాన గేట్లను మూసేయటం, పాలస్తీనా జెండాలను ఎగురవేయటం.. వంటివి సోమవారం రాత్రి నుంచి మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా అంతటా వర్సిటీల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. నిరసన శిబిరాల నుంచి విద్యార్థులను తరలించటంపై వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. టెక్సాస్, ఉటా, వర్జీనియా, న్యూజెర్సీల్లో వందలాది మందిని పోలీసులు అరెస్టు చేయాల్సి వచ్చింది.

# ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య

- **అధికారుల వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్**
- **కుటుంబసమస్యలతోనే ఆత్మహత్య**
- **అధికారులను బాధ్యులను చేయొద్దు : ఆర్టీసీ ఎండీ**

యాలాల/హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ అధికారుల వేధింపులు తాళలేక సంస్థకు చెందిన ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో మంగళవారం కలకలం రేపింది. యాలాల మండలం దౌలాపూర్‌కు చెందిన టీ రాజప్ప (50) 2013లో బస్‌డ్రైవర్‌గా ఆర్టీసీలో ఉద్యోగంలో చేరాడు. 2018లో ఆయనకు గుండె సంబంధిత సమస్యలతో శ్రామిక్‌గా నియమించారు. మొదట్లో డీజిల్ టాపప్‌గా పని చేస్తుండేవాడు. ప్రస్తుతం గ్రీసింగ్ పనులు చేస్తున్నాడు. మంగళవారం దౌలాపూర్ శివారులో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా దవాఖానకు తరలించారు. తనను ఉన్నతాధికారులు వేధిస్తున్నారంటూ రాజప్ప రాసిన సూసైడ్ నోట్ కలకలం రేపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సిబ్బందిపై చేసిన ఆరోపణలను డీఎం సమత ఖండించారు. కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకొని, అధికారులను బాధ్యు లనడం సరికాదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.

